క్లుప్తంగా

అడివేశ్వరస్వామి ఆలయానికి మెరుగులు



రాజోళి: మండల కేంద్రంలో కొలువైన భ్రమరాంబ అడివేశ్వరస్వామి ఆలయానికి గురువారం మెరుగులు దిద్దే పనులు ప్రారంభించారు. ఆలయంలో నూతన కల్యాణ మండపం, మహాగణపతి, మాత పార్వతి విగ్రహాల ప్రతిష్ఠోత్సవాన్ని పురస్కరించుకొని అలంకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అందులో భాగంగా అడివేశ్వరస్వామి ఆలయానికి కూడా రంగులు దిద్ది ముస్తాబు చేస్తున్నారు. ఆలయ గోపురం, శిఖరం, గోడలు, ఇరువైపులా రంగులు వేస్తున్నారు.

'కేసులు పెట్టే పంచాయతీ కార్యదర్శి మాకొద్దు'

రాజోళి: 'గ్రామంలో అందుబాటులో ఉండకుండా.. గ్రామస్తుల సమస్యలపై స్పందించకుండా, అడిగితే కేసులు పెడతామనే పంచాయతీ కార్యదర్శి మాకొద్దని' ముండ్లదిన్నె గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని ముండ్లదిన్నె, పచ్చర్ల, పెద్ద ధన్వాడ గ్రామాల్లో గ్రామసభ నిర్వహించగా ప్రజలు సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్నారు. పచ్చర్లల్లో ఇళ్లు రాని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న జాబితాలో ఇళ్లు ఉన్న వారికే మళ్లీ ఇళ్లు వచ్చాయని మండిపడ్డారు. కాగా ముండ్లదిన్నెలో వీధి లైట్లు పడటం లేదని, నీటి ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయని, మోటార్లు పని చేయడం లేదని, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదని చెబితే, అధికారులకు ఫిర్యాదు చేస్తే తమపైనే కేసులు పెడతామని బెదిరించే పంచాయతీ కార్యదర్శి మాకెందుకు అని గ్రామస్తులు గ్రామసభ సాక్షిగా అడిగారు. గతంలో ఉన్న పలు సమస్యలపై వాట్సాప్ ద్వారా, నేరుగా అడిగితే, గ్రామస్తుల్లో కొందరిపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారని మండిపడ్డారు. సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెడతామని అధికారులే బెదిరిస్తే సామాన్యుల పరిస్థితి ఏంటని గ్రామస్తులు నిలదీశారు.

ముగిసిన ఉత్సవాలు



అయిజ: మండలంలోని ఉత్తనూరు గ్రామంలో నిర్వహిస్తున్న గోపాలదాసుల వారి ఆరాధన ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో గోపాలదాసుల వంశస్థులు మూల సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ధన్వంతరి హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గోపాలదాస్, రాఘవేంద్రదాస్, మోహన్‌దాస్, రమేష్ ఆచార్, ప్రసన్న చార్, ప్రమోద ఆచార్, నరేష్ ఆచార్, శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతుల పరిశీలిన

గద్వాల టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పది విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ప్రియాంక పరిశీలించారు. గురువారం సాయంత్రం ఆయా పాఠశాలలకు వెళ్లి ప్రత్యేక తరగతుల తీరు తెన్నులను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక తరగతులతో పాటు స్లిప్ టెస్టులను నిర్వహించాలని సూచించారు. పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.


చికిత్స పొందుతూ యువకుడి మృతి



తిప్పన్న (ఫైల్)

అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని పర్ధిపురం గ్రామానికి చెందిన వెంకట్రాములు, పద్మమ్మ దంపతుల కుమారుడు తిప్పన్న (22) ఈనెల 18న వారి నివాసంలో గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం బాధితుడిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తిప్పన్న గురువారం మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసచారి పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..



జయరాముడు (ఫైల్)

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడు స్టేజ్ సమీపంలో కారు, బైక్‌ను ఢీ కొట్టిన ఘటనలో కొండపల్లికి చెందిన జయరాముడు అనే యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం జరిగిన ఘటన విదితమే. బాధితుడు బుధవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అన్న తెలుగు పెద్ద రాముడు ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

అర్హులనే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తాం

సాక్షి, నెట్‌వర్క్: అర్హులనే సంక్షేమ పథకాలకు లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నామని అదనపు కలెక్టర్లు నర్సింగరావు, లక్ష్మీనారాయణ, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. అనివార్య కారణాల వల్ల లబ్ధిదారులుగా ఎంపిక కాని అర్హులు ఎవరైనా ఉంటే మరోసారి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గురువారం జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించారు.

■ మానవపాడు మండలంలోని జల్లాపురంలో గ్రామసభకు జాయింట్ కలెక్టర్ లక్ష్మీనారాయణ హాజరై పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. అర్హులు అయి జాబితాలో పేరు లేకుంటే మరోమారు దరఖాస్తు చేసుకోవాలన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, ప్రత్యేక అధికారి సక్రియానాయక్, గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, డీటీ ధరణిషా తదితరులు పాల్గొన్నారు.

■ గట్టు మండల కేంద్రంతో పాటు ఆరగిద్ద గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామసభకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నర్సింగరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మిట్టదొడ్డి, అంతంపల్లి, లింగాపురం, ఇందువాసి, రాయాపురం గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరభద్రప్ప, ఎంపీడీఓ చెన్నయ్య, ఏఓ హనుమంతురెడ్డి, ఏపీఓ స్వామి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగులయ్య, తహసీల్దార్ వీరభద్రప్ప, ఎంపీడీఓ చెన్నయ్య, జంబురామన్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

■ అయిజ మున్సిపాలిటీలోని 11వ వార్డులో గురువారం నిర్వహించిన వార్డు సభ రసాభాసాగా మారింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం జాబితా అనర్హుల పేర్లు ఉన్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు వచ్చినా గొడవ సద్దుమణగకపోవడంతో అధికారులు వార్డు సభను తూతూమంత్రంగా ముగించారు. సభ నిర్వహణకు ఏర్పాటు చేసిన బ్యానర్‌లో తన ఫొటో లేకపోవడంపై మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అధికారులపై మండిపడ్డారు.

■ అలంపూర్ మండలంలో గురువారం 654 మంది పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్నరని ఎంపీడీఓ పద్మావతి తెలిపారు. కోనేర్, సూల్తాన్‌పూర్, భైరంపల్లి గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ రాజశేఖర్, ఏఓ నాగర్జున్‌రెడ్డి, ఏపీఓ రాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఆరగిద్ద గ్రామసభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు



జల్లాపురంలో సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

■ కేటీదొడ్డి మండలంలోని రంగాపురం, పాగుంట, మల్లాపురం, ఈర్లబండ గ్రామాల్లో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, ఆర్ఐలు ఉదయ్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, ఏఓ సాజీద్, ఏఈఓలు ప్రీతిసుధ, ప్రియాంక, జ్యోతి, లావణ్య, తదితరులు ఉన్నారు.

■ ధరూరు మండలంలోని భీంపురం, చిన్నపాడు, పారుచర్ల, బులోనిపల్లి, ద్యాగదొడ్డి, గుడ్డెందొడ్డి, నాగర్‌దొడ్డి, నెట్టెంపాడు తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు కురువ సురేష్, తహసీల్దార్ వెంకట్రావు, ఎంపీడీఓ మంజుల, ఏఓ శ్రీలత, ఆర్ఐలు తిరుమలేష్, రవితేజ, ఏపీఎం శోభారాణి, కార్యదర్శి వసంత్ పాల్గొన్నారు.

■ ఇటిక్యాల మండలంలోని నక్కలపల్లి, శనగపల్లి, బుద్దారెడ్డిపల్లి, ఉదండాపురం గ్రామాల్లో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, ఆర్ఐ భీంసేన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

■ అయిజ మండలంలోని ఎక్లాస్‌పురం, ఈడుగోనిపల్లి, వేణిసోంపురం, భూంపురం, తొత్తినోనిదొడ్డి, కుర్వపల్లి, రాజాపురంలో గ్రామసభలు, మున్సిపాలిటీలో 3, 7, 11, 15, 19 వార్డుల్లో వార్డుసభలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అశోక్‌రెడ్డి, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ వెంకటయ్య, ఎంపీఓ జనార్దన్, ఎంపీఓ మహేష్, ఆర్ఐ మద్దిలేటి, ఏపీఎం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

■ శాంతినగర్ మండలం, వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 9, 10 వార్డుల్లో సభలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజయ్య, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

■ మల్దకల్ మండలంలోని పెద్దొడ్డి, మద్దెలబండ పెద్దతండా, పెద్దపల్లి, మంగంపేట, మేకలసోంపల్లి, విఠలాపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, తహసీల్దార్ జుబేర్ మొయిద్దీన్, డీటీ ఝాన్సీరాణి, ఎంపీఓ రాజశేఖర్, సూపరింటెండెంట్ నర్సన్న, సీనియర్ అసిస్టెంట్ సూర్యప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

■ ఉండవెల్లి మండలంలోని కంచుపాడు, ప్రాగటూరు, కలుగోట్ల, తక్కశిల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుపతన్న, తహసీల్దార్ హరికృష్ణ, ఏఓ అనిత, పశువైద్యాధికారి శిరీష, మిషన్ భగీరథ ఏఈ అర్షద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రాజాపురంలో..



జూలెకల్‌లో దరఖాస్తులు సమర్పిస్తున్న గ్రామస్తులు

విద్యార్థినులు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి

అయిజ: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం రాష్ట్రీయ కిశోర బాల, బాలికల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్‌కేఎస్‌కే హెల్త్ కౌన్సిలర్ రామాంజనేయులు విద్యార్థినులకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత అవసరమన్నారు. అనారోగ్యం కలిగితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు త్రివేణి, కవిత, ఏఎస్‌హెచ్ఏలు పార్వతి, నాగబాల, అలివేలమ్మ, పాఠశాల సీఆర్పీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్‌కేఎస్‌కే హెల్త్ కౌన్సిలర్ రామాంజనేయులు

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గట్టు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలంటూ బీఆర్ఎస్ నాయకులు గురువారం గట్టులో గద్వాల ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ప్రజాపాలన గ్రామసభకు హాజరైన గద్వాల ఎమ్మెల్యేను బీఆర్ఎస్ పార్టీ నాయకులు రామునాయుడు, వెంకటేష్, రవి, తిమ్మప్ప కలిసి సమస్యలపై చర్చించారు. రైతుల రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కల్యాణలక్ష్మి, పింఛన్ వంటి హామీలను ఇప్పటికి వరకు సక్రమంగా అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

'అనర్హులకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారు'

గట్టు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామాల్లో నాయకుల సిఫారస్ మేరకు అనర్హులకు అందేలా చూస్తున్నారని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కర్రెప్ప ఆరోపించారు. గురువారం గట్టులో ఏర్పాటు చేసిన సమావేశంలో కర్రెప్ప మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లాంటి పథకాల్లో లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని, పేదలకు న్యాయం చేయాలని కోరారు. గ్రామాల్లో గ్రామ సభల ద్వారా అర్హులైన వారిని ఎంపిక చేయకుండా అధికార పార్టీ నాయకులు వారికి నచ్చిన వారకి లబ్ధి చేకూర్చుతున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 20 రోజుల కూలి పనులు చేసి ఉండాలనే నిబంధనను సడలించాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల సహాయ కార్యదర్శి ఆంజనేయులు, గ్రామ కార్యదర్శి శాంతిరాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కర్రెప్ప

గణిత క్యాలెండర్ ఆవిష్కరణ

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత కాంప్లెక్స్ స్కూల్ సమావేశం నిర్వహించి.. ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను ఎంఈఓ రామకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 6, 7, 8, 9 తరగతులు చదివే విద్యార్థులందరికీ విద్యా సంవత్సరం ముగిసే సమయానికి చతుర్విధ ప్రక్రియలు, గణితంలో కనీస సామర్థ్యాలు వచ్చే విధంగా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యాశాఖ తరఫున ప్రతాప్‌రెడ్డి, డీసీఈబీ సెక్రెటరీ శిక్షణ తీరును పరిశీలించారు. విద్యార్థులు గణితంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చొరువ చూపాలన్నారు. అనంతరం గణిత క్యాలెండర్లను ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు హేమలత, గణిత శాస్త్రం ఉపాధ్యాయుడు సుందర్‌రెడ్డి, తదితర్లు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో గణిత క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

సమయపాలన పాటించాలి

కేటీదొడ్డి: విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కనీస సామర్థ్యాలు సాధించే విధంగా ఎఫ్ఎల్ఎన్ పద్ధతిలో బోధన చేయాలన్నారు. బేస్ లైన్ టెస్ట్ రిపోర్ట్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలని, బడిబయట పిల్లలను బడిలో చేర్పించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయభాస్కర్, పరశురాముడు, సీఆర్పీ శివరాజ్ తదితరులు ఉన్నారు.

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించి వారి విద్యా ప్రమాణాలను పెంచాలన్నారు. ప్రతి పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఆర్పీలు పద్మావతి, పరమన్న, బాలగౌడ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ధరూరు: మండలంలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో తెలంగాణ ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) క్యాలెండర్‌ను స్కూల్ కాంప్లెక్స్ సమావేశం భోజన విరామ సమయంలో పాఠశాల హెచ్ఎం గౌరీ శంకర్, తపస్ మండల అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్, ఆంజనేయులు, చక్రవర్తి, చంద్రశేఖర్, గీతామణి, శ్రీలత, పద్మావతి, రవి, అంజి తదితరులు పాల్గొన్నారు.

అభ్యాసన సామర్థ్యాల పరిశీలన

పాఠశాలల్లో మౌళిక సదుపాయాలతో పాటు విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను మండల విద్యాధికారి రవీంద్రబాబు పరిశీలించారు. గురువారం మండలంలోని వామన్‌పల్లి పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అదే విధంగా అపార్ నెంబరు వచ్చేటట్లు చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం ఉప్పేరు ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వండాలని సూచించారు.

జీహెచ్ఎంల డైరీలను ఆవిష్కరణ

అలంపూర్: కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో రాష్ట్ర జీహెచ్ఎంల క్యాలెండర్, డైరీలను ఎమ్మెల్యే విజయుడు గురువారం ఆవిష్కరించారు. అలంపూర్ నియోజకవర్గంలోని జీహెచ్ఎంలు ఎమ్మెల్యే విజయుడును కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జీహెచ్ఎంల క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు అశోక్ కుమార్, రామకృష్ణ, భగీరథ రెడ్డి, జీహెచ్ఎంలు హేమలత, వెంకటేశ్వర్‌రెడ్డి, అమరేందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, జాఫర్, మానవపాడు మండల నోడల్ అధికారి విష్ణువర్ధన్, మాజీ ఎంఈఓ రాజు తదితరులు ఉన్నారు.

మానవపాడు: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు హాజరయ్యేటట్లు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని నారాయణపురం పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు రాయడం, చదవడం, నేర్పించాలని సూచించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని ఆదేశించారు.

'ఏనాడు అంబేడ్కర్ పేరు పెట్టలేదు'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గద్వాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు ఏనాడు అంబేడ్కర్ పేరు పెట్టలేదని, కేవలం గాంధీ పరివార్ పేర్లు పెట్టుకుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని 25వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో గురువారం భారత రాజ్యాంగ సంవిధాన్ గౌరవ్ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను, రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ఏనాడు గౌరవించలేదని ఆరోపించారు. ఈ నెల 11 నుంచి 25 వరకు 'సంవిధాన్ గౌరవ్ అభియాన్' నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 24, 25 తేదీల్లో కళాశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో రాజ్యాంగంపై బీజేపీ నిబద్ధతను వివరించాలని సూచించారు. 26న ప్రతి బూత్‌లో గణతంత్ర దినోత్సవం నిర్వహించి, ప్రవేశిక, ఆదేశిక సూత్రాలు చదివి వినిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామంజనేయులు, జయశ్రీ, బండల వెంకట్రాములు, రజక నర్సింహులు, చిత్తారి కిరణ్, దేవదాసు, శంకర్, కృష్ణ, వాసు, డబ్బిలేటి నర్సింహా, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌టీఐ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

గట్టు: ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలను గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దాత శిల్పా భాస్కరన్ కోరారు. ఎల్‌టీఐమైండ్‌ట్రీ, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థలు గట్టు మండలంలో 12 గ్రామాల్లో చేస్తున్న సేవలను క్షేత్ర స్థాయిలో నిధుల అందజేస్తున్న దాత శిల్పా భాస్కరన్ పరిశీలించారు. పెంచికలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు, తుమ్మలచెరువులో పాండ్ రెనోవేషన్, బల్గెరలో వీడీసీ అంగన్‌వాడి రెనోవేషన్, నర్సరీ, మహిళా సంఘాల సమావేశాలు వంటి వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. కార్యక్రమంలో భవిష్య భారత్ టీం రాష్ట్ర సమన్వయకర్త వినయ్, డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ బాలరాజు, రాజారాం, లైవ్లీహుడ్ ఆఫీసర్ వెంకట్, హరి, మునిస్వామి, ఆయా గ్రామాల కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.



మల్లంపల్లిలో సేంద్రియ వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న దాత

కాంగ్రెస్ పార్టీలో చేరిక

అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామానికి చెందిన 6వ వార్డు కౌన్సిలర్ ఆంజనేయులు ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం హైదరాబాద్‌లోని సంపత్‌కుమార్ నివాసంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంపత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కౌన్సిలర్ ఆంజనేయులకు సంపత్‌కుమార్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షేక్షావలి ఆచారి, మధుకుమార్, జయన్న తదితరులు పాల్గొన్నారు.



మహాసభలను జయప్రదం చేద్దాం

అలంపూర్ : సీపీఎం రాష్ట్ర మహా సభలను జయప్రదం చేద్దామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజు, రేపల్లె దేవదాసు పిలుపునిచ్చారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం మహాసభల పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, వెంకటస్వామి, అయ్యప్ప, నాగరాజు, రఫీక్ తదితరులు ఉన్నారు.

అయిజ: సంగారెడ్డి పట్టణంలో ఈనెల 25 నుంచి 28 వరకు నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వీవీ నరసింహ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాముడు, తిమ్మప్ప, నరసింహులు, హమాలీ సంఘం నాయకులు పరశురాములు, నజీర్, వెంకటేష్, హనుమన్న తదితరులు పాల్గొన్నారు.

టోర్నమెంట్ ప్రారంభం

అయిజ: మండల కేంద్రంలోని తిక్క వీరేశ్వర స్వామి ఆలయం సమీపంలో గురువారం బీబీఎల్ లీగ్ సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌చార్జ్ ఎస్ఐ శ్రీనివాసులు, ఎంఈఓ రాములు హాజరయ్యారు. ఈసందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు కళ్యాణ్ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సాయిరెడ్డి, రవీందర్‌రెడ్డి, విక్రాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కళా ప్రదర్శన విజయవంతం చేద్దాం

ఎర్రవల్లి: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే వెయ్యి డప్పులు.. లక్ష గొంతుకలు కళా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పోగుల రాజేష్ కోరారు. గురువారం రాత్రి ఎర్రవల్లి మండల కేంద్రానికి కళా యాత్ర వాహనం చేరుకుంది. ఈ సందర్భంగా కూడలిలో కళా మండలి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ డప్పు స్వామి కళాకారులతో కలిసి ఆటా పాటలతో కళా ప్రదర్శన నిర్వహించారు. నాయకులు మస్తాన్, ప్రభుదాస్, విజయ్, మంద సత్యం, యోహాన్, శ్రీను, రాముడు, ఏసన్న, చరణ్ పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం శివారులో కర్నూల్ జిల్లా ఈ తాండ్రపాడు గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను టిప్పర్‌లో తరలిస్తుండగా పోలీసులు అబ్దుల్ బాషా పట్టుకుని అనుమతి పత్రాలు చూపించాలని కోరారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్ కిరణ్, యజమాని రాజశేఖర్‌పై ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

అలంపూర్: ఆటోను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా ఇద్దరు గాయపడిన ఘటన అలంపూర్ చౌరస్తా సమీపంలోని ఉత్తపుడ్స్ కంపెనీ వద్ద గురువారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు.. కర్నూల్ జిల్లా బెలగల్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఖాజావలి, ఆయన అల్లుడు షేక్షా ఇటిక్యాల మండలంలోని శివరాంపల్లి నుంచి ఆటోలో సామగ్రి తీసుకొని వెళ్తుండగా అలంపూర్ చౌరస్తా సమీపంలోని ఉత్తపుడ్స్ కంపెనీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఘటనలో ఆటోలో ఉన్న ఇద్దరితో పాటు ప్రయాణికులు ముగ్గురికి గాయాలైనట్లు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో గాయపడిన వారిని ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సుభాష్‌చంద్రబోస్‌కు ఘన నివాళి

సాక్షి, నెట్‌వర్క్: సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని నాయకులు గురువారం జిల్లా వ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద ఘనంగా నివాళులర్పించారు.

■ వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో నేతాజీ సుభాస్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శేఖర్, గోపాల్, వెంకట్, భాస్కర్, శీను, అంజి, మధు, రామకృష్ణ, అశోక్, రవి, కర్ణ, దామోదర్ పాల్గొన్నారు.

■ మల్దకల్ మండలంలోని మల్దకల్, బిజ్వారం, ఎల్కూరు, అమరవాయి, తాటికుంట, విఠలాపురం, నాగర్‌దొడ్డి, పాల్వాయి గ్రామాల్లోని పాఠశాల్లో నేతాజీ సుబాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జీ ఎంఈఓ సురేష్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ అయిజ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌గౌడ్, ఈరన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

■ ఉండవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల విద్యా విభాగం కార్యదర్శి, వెంకటేష్ గౌడు, ప్రధాన కార్యదర్శి కృష్ణ, సభ్యులు బల్వీర్ సింగ్, సుధాకర్‌రెడ్డి, మురళీమోహన్, ప్రధానోపాధ్యాయులు హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉండవెల్లి పాఠశాలలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు